సింగరేణితో

# ఆర్వీయూఎన్ఎల్ మెగా ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. తెలంగాణలో అపార బొగ్గు నిల్వలు..తెలంగాణ రాష్ట్రం అపార బొగ్గు నిల్వ లతో థర్మల్ విద్యుత్కకు నిలయంగా, రాజస్థాన్ రాష్ట్రం సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా దేశంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాయని భట్టి పేర్కొన్నారు. పురోగతి పంథాలో సాగుతున్న ఈ రెండు రాష్ట్రాలు తమ భౌగోళిక పరిస్థితులను అవకాశాలుగా మలచుకోవడానికి పరస్పర సహకా రంతో ముందుకు రావడంతో దేశ ఇంధన రంగంలో విప్లవాత్మకమైన మార్పునకు శ్రీకారం చుట్టినట్లు అయిం దన్నారు. తెలంగాణ రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందన్న రు. ఇరు సంస్థలు జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పడి 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ను, 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేయను న్నాయని, పెరుగుతున్న దేశ విద్యుత్ అవసరాలకు ఈ ఒప్పందం ఎంతో దోహదపడనున్నదని పేర్కొన్నారు. వినియోగదారులకు చవకైనా విద్యుత్ ను అందించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమ రాష్ట్ర విద్యుత్ శాఖ సానుకూ లంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ రాష్ట్ర ఇందు ఇంధన శాఖ అడిషన్ చీఫ్ సెక్రటరీ అలోక్, తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎస్.బలరామ్, సింగరేణి డైరెక్ట ర్ డి. సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

తాజా ఒప్పందం ప్రకారం 1.600మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతోపాటు 1.500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. మొత్తం పెట్టుబడిలో సింగరేణి సంస్థ 74 శాతం వాటాను. రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదని నిగం లిమిటెడ్ 26 శాతం వాటాను చెల్లించ నున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం తన వాటా కింద చెల్లించాల్సిన 26 శాతం ధనాన్ని సోలార్, మరియు థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అవసరమైనస్థలాలు. మౌలికసదు సామాల రూపంలోగా సింగరేణి లేని చాటాగా అంగీకరించిన 74 శాతాన్ని ధన రూపంలో చెల్లించ నుంది. ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని అన్ని రకాల అనుమతులతో సింగరేణికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించనున్నది. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి డిన్యము లతో ఒప్పందాలు (పీపీఏ) తదితర అంశాలను రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ శాఖ వారు చేపట్టనున్నారు. పరస్పర అవగాహనతో లాభదాయకంగా ప్లాం ట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తారు.

# సీఎంకు 10 వేల పోస్టు కార్డులు...

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామన్న సీఎం ప్రకటనకు, ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్పా పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశంలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెడితే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. మార్చి 8న ఈ పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని విమర్శించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వడ్డీ రాయితీ బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలన్నారు. భర్త చనిపోయిన మహిళలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు వస్తున్న పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కొత్తగా పెన్షన్‌దారులను నమోదుచేయడం లేదన్నారు. తక్షణమే పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచడంతోపాటు, అభయ హస్తం నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. నేరాల శాతం 20 శాతం పెరిగాయని డీజీపీ వెల్లడించారు. ఆడబిడ్డలకు

రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలన్నారు. కేసీఆర్ కిట్ పంపిణీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీ మానవత్వాన్ని మంటకలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసీఆర్ కిట్‌ను కొనసాగించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. మహిళా కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మహిళా కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికుల జీతాలను పెంచుతామని హామీ ఇచ్చిన విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం..

వెంటనే అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఢాంబికాలు పలుకుతున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఆ పోస్టులను సృష్టించారని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఆడపిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చేయడం లేదని, దీంతో తల్లిదండ్రులు వారిని చదువు మానిపిస్తున్నారని తెలిపారు.

## మేనల్లుడిని పార్టీ నుంచి బహిష్కరించిన మాయావతి

బలగం టీవీ, హైదరాబాద్

బీఎస్పీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాను బతికున్నంత కాలం పార్టీలో తన రాజకీయ వారసుడంటూ ఎవరూ ఉండబోరని ఆమె ఇటీవల ప్రకటించారు. అంతేకాదు పార్టీకి సంబంధించిన అన్ని కీలక పదవుల నుంచి అతనిని తొలగిస్తున్నట్లు నిన్న ప్రకటించారు. తాజాగా, ఆయనను పార్టీ నుంచి బహిష్కరించారు.

తనకు పార్టీయే ముఖ్యమని, ఆ తర్వాతే తనకు కుటుంబమని నిన్న ఆమె స్పష్టం చేశారు. పార్టీ విధానాలకు హాని కలిగించేలా తన పేరును ఎవరైనా దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. బీఎస్పీని రెండు వర్గాలుగా చీల్చి, బలహీనపరిచే ప్రయత్నం చేసిన ఆకాశ్ మామ అశోక్ సిద్ధార్థను గత నెలలో పార్టీ నుండి బహిష్కరించినట్లు తెలిపారు.



## అయోధ్య రామాలయం దర్శనం వేళలు పొడిగింపు

బలగం టీవీ, హైదరాబాద్

అయోధ్యలోని రామ మందిరంలో దర్శనం వేళలను పొడిగించారు. ఆలయాన్ని ఇక ఉదయం 7 గంటలకు బదులుగా 6 గంటలకే తెరుస్తారు. సవరించిన హారతి సమయాలతో సహా కొత్త షెడ్యూల్ సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్లు ఆలయ ట్రస్ట్ మీడియా కేంద్రం తెలియజేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం, భక్తులు శృంగార్ హారతి తరువాత ఉదయం 6.30 గంటల నుంచి 11.50 వరకు ఆలయంలోకి ప్రవేశించవచ్చు. ఆలయాన్ని అప్పుడు రాజ్ భోగ్ హారతి కోసం మధ్యాహ్నం 12 గంటలకు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6.50 గంటల వరకు దైవ దర్శనం చేసుకోవచ్చు. ఆ తరువాత రాత్రి 7 గంటలకు సంధ్య హారతి నిర్వహిస్తారు. భక్తులకు దర్శనాన్ని రాత్రి 9.45 గంటల వరకు అనుమతిస్తారని, అటుపిమ్మట రాత్రి 10 గంటల తరువాత ఆలయాన్ని మూసివేస్తారని ట్రస్ట్ తెలిపింది

## గంజాయితో దొరికిన ఐఐటీ బాబా

బలగం టీవీ, హైదరాబాద్



ఐఐటీ బాబా ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో దాయాదుల పోరు సందర్భంగా... పాక్ పై కోహ్లీ పరుగులు చేయలేడని, ఈ మ్యాచ్ లో బారత్ ఓడిపోతుందని చెప్పాడు. కానీ ఆ మ్యాచ్ లో కోహ్లీ సెంచరీ చేయడం, టీమిండియా గెలవడం అందరికీ తెలిసిందే. దాంతో ఐఐటీ బాబాపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత టీవీ చానల్ డిబేట్ లో తనను కొట్టారని ఆరోపణలు చేశాడు. ఆ వ్యవహారం సద్దుమణిగింది అనుకునే లోపు... తాజాగా గంజాయి వ్యవహారంలో చిక్కుకున్నాడు. గంజాయి కేసులో అతడిని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. జైపూర్ లో ఓ హోటల్ లో ఉన్న ఐఐటీ బాబా నుంచి గంజాయి, ఇంకా పలు మాదక ద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఐఐటీ బాబా స్పందిస్తూ... తన వద్ద లభించింది గంజాయి కాదని, ప్రసాదం అని చెప్పుకొచ్చాడు. ఈ ప్రసాదం సేవించడం తప్పు అయితే, కుంభమేళాలో అనేకమంది ఈ ప్రసాదాన్ని తీసుకున్నారని, వాళ్లందరినీ కూడా అరెస్ట్ చేయాల్సి ఉంటుందని అన్నాడు. కాగా, జైపూర్ పోలీసులు అతడిపై ఎన్డీపీఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పసుపు బోర్డు సెక్రటరీ భవాని బాధ్యతలు స్వీకరణ

బలగం టీవీ, హైదరాబాద్

పసుపు రైతుల సంక్షే మానికి కృషి చేస్తానని జాతీయ పసుపు బోర్డు సెక్రటరీ భవాని (ఐఏఎస్) అన్నారు. సోమవారం నిజామాబాద్ లోని జాతీ య పసుపు బోర్డు కార్యా లయంలో పసుపు బోర్డు సెక్రటరీ భవాని (ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అం దించారు.బాధ్యతలు తీసుకున్న వెంటనే జక్రాన్ పల్లి మండలంలోని మనో హరాబాద్ లో గల జేఎంకే పిఎం రైతు సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటైన పసుపు ఆధారిత పరిశ్రమను బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి తో కలిసి సందర్శిం చారు. రూ.3 కోట్ల వ్య యంతో ఆత్మ నిర్భర్ భారత్ పథకంలో మండ లంలోని పలు గ్రామాలకు చెందిన 600 కు పైగా రైతులు ఏర్పాటు చేసుకో వడం అభినందనీ యమ న్నారు. అనంతరం పరిశ్ర మలో తయారు చేసిన పసుపు పౌడర్ ని ఆసక్తి గా పరిశీలించారు. ఇలాం టి పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల పసుపు రైతులకు మేలు కలగ డమే గాక, స్థానిక యువ తకి పెద్ద ఎత్తున ఉద్యో గాలు లభించే ఆస్కారం ఉందన్నారు. అనంతరం కమ్మర్ పల్లి మండల కేంద్రంలో గల పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ద్వారా రైతులకు అందిస్తు న్న సేవలను శాస్త్రవేత్త మహేందర్ రెడ్డి వివరిం చారు. వీరి వెంట స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేశన్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద

తెలంగాణలోఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నిక కోసం నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీ కాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ ఐదు స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

**మార్చి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ**
**మార్చి 3 నుంచి10వ తేదీవరకూ నామినేషన్ల స్వీకరణ**
**మార్చి 11న నామినేషన్ల పరిశీలన**
**మార్చి 13న నామినేషన్ల ఉపసంహరణ**
**మార్చి 20వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్**
**మార్చి 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ**

ప్రస్తుతం శాసనసభలో పార్టీలకున్న సంఖ్యా బలాన్ని బట్టి అధికార కాంగ్రెస్ పార్టీకి మూడు ఎమ్మెల్సీ స్థానాలు, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ సీటు దక్కే అవకాశం ఉంది. ఒక్క సీటుకు పోటీ అనివార్యం. కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంఐఎం ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు సపోర్టు చేస్తే మరో సీటు కాంగ్రెస్ ఖాతాలోకి వెళుతుంది. లేకుంటే ఒక టికెట్ కోసం పోటీ జరుగుతుంది.

# అమాయకుల ప్రాణాలను ఫణంగా పెట్టిన పాపం సీఎందే..

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్



శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదానికి కారణం కేసీఆర్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం, 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పండబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల నిండు ప్రాణాలను ఫణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రిదేనని చెప్పారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005–2014 వరకున్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే అన్నారు. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా, ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్–ఎల్‌బీసీ పనులకు రూ.3300 కోట్లు ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ పాలనలో రూ.3900 కోట్ల పనులు పూర్తిచేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవాచేశారు. గత కాంగ్రెస్ సర్కారుకన్నా రూ.600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేండ్లలోనే 203 కిలోమీటర్ల టన్నెళ్లు తవ్వినా, ఎస్ఎల్‌బీసీ వంటి దారుణ సంఘటన జరిగిన దాఖలా లేవని వెల్లడించారు. రైతులకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు కాకుండా.. గల్లీ నుంచి ఢిల్లీదాకా కమీషన్లిచ్చే ప్రాజెక్టులు చేపట్టి వాటిని అర్ధాంతరంగా గాలికి వదిలేసే నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప ముఖ్యమంత్రి ముందు మరో మార్గం లేదని చెప్పారు. ఈ డ్యామేజ్ డైవర్షన్ కుట్రలు చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.



## బావిలో పడిన మహిళను రక్షించిన అగ్నిమాపక సిబ్బంది..

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరుపల్లి గ్రామానికి చెందిన నేదూరి భారత ప్రమాదవశాత్తు బావిలో పడటంతో వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. వేములవాడ ఎస్ఎఫ్ఓ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థానిక చేరుకుని ప్రాణాలకు తెగించి మహిళను మంచం సహాయంతో బావిలో నుంచి బయటకు తీసి వెంటనే 108 లో అస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞ తలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్ ఎఫ్ ఓ అనీల్ కుమార్, లీడింగ్ ఫైర్ మన్ రాజేంద్ర ప్రసాద్, ఫైర్ మ్యాన్ శంకర్, ప్రేమ్ చంద్, ఉపేందర్, చంద్రశేఖర్ ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు..

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించండి..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 108 దరఖాస్తులు రాగ, ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు పరికరాల అందజేతలి**

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఇద్దరు దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. ఎల్లారెడ్డి పేట మండలం గొల్లపల్లికి చెందిన దాసరి పవన్ అనే బాలుడు పుట్టుక తోనే నడవలేని స్థితిలో ఉన్నాడు. తనకు వీల్ చైర్ ఇప్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు విన్నవించాడు. వేములవాడ లోని సాయి నగర్ కు చెందిన లేదేళ్ల రమేష్ తనకు మ్యానువల్ ట్రై సైకిల్ ఇప్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు విన్నవించాడు.

కలెక్టర్ ఆదేశాల మేరకు దాసరి పవన్ కు వీల్ చైర్, లేదేళ్ల రమేష్ కు మ్యానువల్ ట్రై సైకిల్, సంక క్ర జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం అందజేశారు. తమకు వీల్ చైర్, ట్రై సైకిల్ అందించి, ఆదుకున్న కలెక్టర్ కు వారు ఇద్దరు కృతజ్ఞతలు తెలిపారు.



## రైతులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ కెనాల్ ద్వారా నీటిని తేవడంలో విఫలమైన మాజీ మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి అధికారంలో ఉండి మలకపేట రిజర్వాయర్ 9వ ప్యాకేజీ పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు అధికారంలో ఉన్నప్పుడే ఈ పనిని పూర్తిచేస్తే రైతులకు ఇలాంటి దుస్థితి వచ్చేది కాదని అన్నారు మిడ్ మానేరు నుండి. 10లి 11 లి 12 లి ప్యాకేజీలను పూర్తి చేసి రంగనాయక కొండపోచమ్మ మల్లన్న సాగర్ ప్రాజెక్టులకు నీటిని నింపి సిరిసిల్ల నియోజకవర్గం లోని అప్పర్ మానేరుకు నీటితో ఎందుకు నింపలేకపోయావని అడిగారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ నీటిని తరలించకపోతుంటే చేతగాని కేటీఆర్ ఎందుకు ఊరుకున్నావని అన్నారు అందుకే ఈ ప్రాంతంలో మాజీ మంత్రి కేటీఆర్ తిరగాలంటే రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు 9వ ప్యాకేజీ కెనాల్ ను పిసిసి అధ్యక్షులు హెూదాలో ఉన్న స్థాయిలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడే



పరిశీలించడం జరిగిందని దీనిపైన ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందన్నారు అందుకే సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తో కలిసి నీటి విడుదలకు గత మూడు రోజులుగా ప్రయత్నం చేసి ఒప్పించడం జరిగిందన్నారు దీనిని ఆసరాగా చేసుకొని 48 గంటల్లో సాగునీరు విడుదల చేయాలని లేకుంటే భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఛాంబర్ దగ్గర ధర్నా చేస్తానని అబద్ధపు మాటలు చెప్పి ఈ ప్రజలను ఎంత కాలం మోసం చేస్తావని అన్నారు ఇప్పటికైనా నీతి నిజాయితీతో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పని చేయాలని ప్రజలు ఆశిస్తున్నట్లు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రైతుల పొలాలకు నీరంధించి పొలాలను కాపాడడం జరుగుతుందని రైతులకు హామీ ఇస్తున్నామని అన్నారు నీటి విడుదలలో సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ కిసాన్ జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్లు నారాయణరెడ్డి చెట్పల్లి బాలయ్య గణపతి నాయకులు చెన్ని బాబు గంట బుచ్చగౌడ్ బండారి బాల్ రెడ్డి మల్లారెడ్డి వడ్నాల దేవయ్య గుర్రం రాములు నవాజ్ గోపాల్ అనవేని రవి గూగుల్ శ్రీనివాసరెడ్డి. చెరుకు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు



## వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ విధులు నిర్వర్తించాలి..

**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నేర చేదనలో సాక్షధారాలు సేకరించడం,కేసుల విచారణ నివేదికలను పటిష్ఠంగా రూపొందించడం వల్ల నేర నిరూపణ జరిగి నిందితులకు శిక్షలు పడే విధంగా చేయవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.సోమవారం జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న నూతన కానిస్టేబుళ్లకు రెడవ దశ రైటర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నూతన కానిస్టేబుళ్లు వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటు విధులు నిర్వర్తించాలన్నారు.జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న నూతన కానిస్టేబుళ్లకు 15 రోజుల రైటర్ శిక్షణలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో కొత్త చట్టాలు,వివిధ నేరస్థలలు సందర్శించిన సమయంలో సాక్షాదారలు ఏ విధముగా సేకరించాలి, శవ పంచనామా ఎలా చేయాలి, నేర స్థలంలో ఏ ఏ వస్తువులు స్వాధీన చేసుకోవాలి,నేర స్థలంలో ఏ ఏ విషయాలు గమనించాలి, సాక్షుల వాంగ్మూలం ఏవిధంగా నమోదు చేయాలి,ఫోరెన్సిక్ లైబరేటరీకి ఎం ఎం పంపించాలి అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు .ఇక్కడ ఇన్స్పెక్టర్ మధుకర్, సిబ్బంది ఉన్నారు..



## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే

**-గ్రీవెన్స్ డే లో 16 ఫిర్యాదులు స్వీకరణ.**

**-ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అన్నారు .గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు .

## వరకట్నం వేధింపులకు గురిచేసిన ఆరుగురుపై కేసు నమోదు..

**ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్

వేరువేరు సంఘటనలలో వరకట్నం వేధింపుల గురిచేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ ఒక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళకు రెండు సంవత్సరాల క్రితం ముస్తాబాద్ మండలానికి చెందిన రాజుతో వివాహం జరిపించారు. వివాహ సమయంలో అప్పటి లాంచనాల ప్రకారం నాలుగు లక్షల రూపాయల కట్నంతో పాటు, బంగారం నగలు కట్న కానుకలు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. గత కొన్ని రోజులుగా అదనంగా లక్ష రూపాయలు తేవాలంటూ భార్యను భర్త రాజు, అత్త కనకవ్వలు మానసికంగా శారీరకంగా వేధింపులకు గురిచేసారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మరో సంఘటనలో రాజన్నపేట గ్రామానికి చెందిన మహిళకు కొత్త పల్లి కి చెందిన రమేష్ తో 16 సంవత్సరాల క్రితం వివాహం జరగగా, వివాహ సమయంలో ఐదు లక్షల రూపాయల నగదు, 9 తులాలు బంగారం అభరణాలు ఇచ్చి వివాహం జరిపించారు. ఆరు సంవత్సరాలుగా భర్త రమేష్, ఆడపడుచులు కిట్టవ్వ, శాంతవ్వ, నరసవ్వలు అదనంగా 5 లక్షల రూపాయల కట్నం తేవాలంటూ శారీరకంగా మానసికంగా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు సోమవారం పోలీసుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.




## తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వేములవాడ ఏ ఎస్ పి సిరిసిల్ల ఇంన్చార్జి ఎస్ డీపీవో శేషాద్రిని రెడ్డి ఐపీఎస్ తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో తనిఖీ చేసి స్టేషన్ రికార్డులను పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు,రికార్డులను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, గంజాయి, స్మగ్లింగ్,రేషన్ బియ్యం,ఇసుక అక్రమ రవాణా మరియు ఇతర కేసుల గురించి వివరాలు తెలుసుకొని వాటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, రంజాన్ పండుగ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ రామ్మోహన్ కి మరియు సిబ్బందికి తెలిపారు.




# కడుపు మండిన కాకుల కథ..

**నాని ప్యారడైజ్ గ్లింప్స్ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

నేచురల్ స్టార్ నాని, దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ప్యారడైజ్. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. వైల్డ్ రైడ్ ఉండబోతుందంటూ ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. చరిత్రలో అందరూ చిలకలు, పావురాల గురించి రాసిన్రు కానీ గదే జాతిలో పుట్టిన కాకుల గురించి రాయలే. ఇది కడుపు మండిన కాకుల కథ. జమానా జమానాకెళ్లి నడిచిన శవాల కథ. అమ్మ రొమ్ముల్లో పాలు లేక రక్తం పోసి పెంచిన ఓ జాతి కథ.. నా కొడుకు నాయకుడైన కథ.అంటూ డార్క్ షేడ్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. నాని రెండు జడలు, సిక్స్ ప్యాక్ బ్యాడీ, గన్స్‌తో నయా లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాడు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# 'ఛావా' తెలుగు ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహరాజ్ జీవితగాథ ఆధారంగా రూపొందిన చిత్రం 'ఛావా'. గత నెలలో హిందీలో విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. అయితే ఈ సినిమాని తెలుగులో విడుదల చేస్తున్నట్లు ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ కొద్ది రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని విడుదల చేశారు. పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఉన్న తెలుగు టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. 'మరాఠా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఎవ్వడు ఆలోచించినా చీల్చి చెండాడుతాను' అంటూ సాగే డైలాగ్స్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమా తెలుగులో మార్చి 7వ తేదీన విడుదల కానుంది. విక్కీ కౌశల్, రష్మిక మందన ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను దినేష్ విజాన్ నిర్మించారు. ఏఆర్ రహమాన్ ఈ సినిమాకు సంగీతం సమకూర్చారు.

# రోహిత్ శర్మపై కాంగ్రెస్ నాయకురాలి బాడి షేమింగ్ వ్యాఖ్యలు

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మపై కాంగ్రెస్ నాయకురాలు షామా మొహమ్మద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తాజాగా దుబాయ్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య ఆదివారం మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ ఆటతీరుపై కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షామా మొహమ్మద్ ఘాటుగా స్పందించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'రోహిత్ లావుగా ఉంటాడు. అతడు బరువు తగ్గాలి. ఫిట్‌నెస్ ఉండదు. ఏదో అదృష్టం కొద్దీ రోహిత్ భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఇప్పటివరకు అత్యంత చెత్త కెప్టెన్ రోహిత్. సచిన్, కోహ్లీ, ధోనీలతో పోలిస్తే రోహిత్ జస్ట్ యావరేజ్ ఆటగాడు' అంటూ షామా ఎక్స్ పోస్టులో కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీజేపీ నేతలు, నెటిజన్లు షామా మొహమ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆమె తన పోస్ట్‌ను సోషల్ మీడియా నుంచి తొలగించారు.

కాగా, షామా వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి స్పందించారు. 'భారత క్రికెట్ జట్టును అభిమానించే ప్రతి దేశభక్తుడికి ఇది అవమానం. కాంగ్రెస్ విమర్శలను నేను ప్రశ్నిస్తున్నాను. రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేసే మీకు కెప్టెన్సీ గురించి ఏం తెలుస్తుంది? అయినా మీరు రాహుల్‌గాంధీ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారా? అంటూ ఎద్దేవా చేశారు. అనంతరం షామా స్పందిస్తూ.. ' ఆ వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయమని, తన పార్టీని ఇందులోకి తీసుకు రావొద్దని కోరారు. "మనం ఒకరి ఫిట్‌నెస్ గురించి మాట్లాడవచ్చు. అందులో తప్పేంటి..? నేను ఫిట్‌గా ఉన్నాను కాబట్టి, నేను అతని ఫిట్‌నెస్ గురించి మాత్రమే మాట్లాడుతున్నాను. మీరు ఈ విషయాన్ని ఎందుకు పెద్దది చేస్తున్నారు?.." అని షామా మొహమ్మద్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

# ఆస్ట్రేలియాపై రివేంజ్ తీర్చుకుంటారా..?




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా ఆసక్తికర పోరుకు సిద్ధమైంది.మంగళవారం దుబాయ్ వేదికగా జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ అనంతరం వన్డే ఫార్మాట్‌లో భారత్, ఆస్ట్రేలియా తొలిసారి తలపడుతున్నాయి. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌లో గెలిచి భారత్ రివేంజ్ తర్చుకుంటుందని అభిమానులు భావిస్తున్నారు.

మంగళవారం దుబాయ్‌లో 24 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉంది. వాతావరణం మ్యాచ్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపే అవకాశం లేదు. ఇక పిచ్ విషయానికొస్తే, బ్యాటర్లకు, బౌలర్లకు ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయి. మొదట బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, సమయం గడిచేకొద్దీ స్పిన్నర్లు పైచేయి సాధించే అవకాశం ఉంటుంది. బౌండరీ లైన్ పెద్దవి కనుక సిక్స్‌లు, ఫోర్లు ఎక్కువ ఆశించలేం. మొదట బ్యాటింగ్ చేసిన జట్టు 260-270 పరుగులు చేసిన మ్యాచ్ హోరాహోరీ తప్పదు. స్టేడియం ఫలితాలను చూస్తే, అత్యధికంగా ఛేజింగ్ చేసిన జట్లు ఇక్కడ విజయాలు సాధించాయి.

బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో టీమిండియా పటిష్టంగా ఉంది. ముఖ్యంగా స్పిన్‌కు అనుకూలంగా ఉన్న దుబాయ్ పిచ్‌పై నలుగురు స్పిన్నర్లతో ప్రత్యర్థుల పతనాన్ని శాసిస్తోంది. టీమిండియా టాప్-4 బ్యాటర్లలో ఇద్దరు రాణించినా సరిపోతుంది. సెమీస్ పోరుకు టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది.నలుగురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతోనే ఆడనుంది. అయితే న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మహమ్మద్ షమీకి గాయమైంది. బ్యాటింగ్ సమయంలో పరుగు తీస్తుండగా.. మిచెల్ సాంట్నర్ వేసిన త్రో అతని భుజానికి బలంగా తాకింది. నొప్పితో విలవిలలాడిన షమీ 4 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. ఫిట్‌గా లేకుంటే అతని స్థానంలో హర్షిత్ రానా లేదా అర్ష్‌దీప్ సింగ్ ఆడే ఛాన్స్ ఉంది.

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్న మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని కొనసాగించనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే మాత్రం కుల్దీప్ యాదవ్‌పై వేటు పడనుంది. బ్యాటింగ్ విభాగంలో రోహిత్, గిల్ ఓపెనింగ్ చేయనుండగా.. కోహ్లీ, అయ్యర్, రాహుల్, అక్షర్ పటేల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. జడేజా, హార్దిక్ పాండ్యా ఫినిషర్ రోల్ పోషించనున్నారు.

ఛాంపియన్స్ ట్రోఫీలో ఇండియా ఆస్ట్రేలియా ట్రాక్ రికార్డుల విషయానికొస్తే.. ఇప్పటి వరకు ఈ ఇరు జట్లు నాలుగు సార్లు తలపడ్డాయి. వీటిలో టీమిండియా రెండు సార్లు, ఆస్ట్రేలియా ఒక దానిలో విజయం సాధించింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. ఇక మొత్తం వన్డేల విషయానికొస్తే, భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటివరకు 151 వన్డే మ్యాచ్‌లు ఆడాయి. వీటిలో ఆస్ట్రేలియా 84 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. భారత్ 57 మ్యాచ్‌ల్లో గెలిచింది. 10 మ్యాచ్‌లు అసంపూర్ణంగా ముగిశాయి.

భారత్, ఆస్ట్రేలియా సెమీ-ఫైనల్ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18 ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. డిజిటల్ గా జియో హాట్‌స్టార్‌లో చూడొచ్చు. మ్యాచ్ మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభం కానుంది.

**తుది జట్లు(అంచనా)**

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ , శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

ఆస్ట్రేలియా: జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), మార్నస్ లాబుస్చాగ్నే, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), అలెక్స్ కారీ, గ్లెన్ మాక్స్‌వెల్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్.

# అనోరాకు అవార్డుల పంట





**బలగం టీవీ, లాస్ ఏంజిల్స్**

ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్న 97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరిగింది. లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా జరిగిన ఈ వేడుకలో రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందిన 'అనోరా'కు అవార్డుల పంట పండింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ విభాగాల్లో 'అనోరా' చిత్రం ఆస్కార్‌లను సొంతం చేసుకుంది. 'ది బ్రూటలిస్ట్'లో నటనకు గానూ ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ, 'అనోరా'లో నటనకు మైకే మ్యాడిసన్ ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ వేడుకలకు హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. ఇక భారత దేశం నుంచి నామినేట్ అయిన అనూజ చిత్రానికి అవార్డు లభించక నిరాశ ఎదురైంది.

**ఆస్కార్ విజేతలు వీరే...**

ఉత్తమ చిత్రం – అనోరా
ఉత్తమ నటుడు – అడ్రియన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి – మైకీ మ్యాడిసన్ (అనోరా)
ఉత్తమ దర్శకత్వం – అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సహాయ నటుడు – కీరన్ కైల్ కల్కిన్ (ది రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి – జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే – అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే – కాన్‌క్లేవ్ (పీటర్ స్ట్రాగన్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ – వికెడ్ (పాల్ తేజ్‌వెల్)
ఉత్తమ మేకప్, హెయిల్‌స్టైల్ – ది సబ్‌స్టాన్స్
ఉత్తమ ఎడిటింగ్ – అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ – ది బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)
ఉత్తమ సౌండ్ – డ్యూన్: పార్ట్2
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ – డ్యూన్:పార్ట్2
ఉత్తమ ఒరిజినల్ సాంగ్ – ఎల్ మాల్ (ఎమిలియా పెరెజ్)
ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ – ఐయామ్ స్టిల్ హియర్ (వాల్టర్ సాలెస్– బ్రెజిల్)
ఉత్తమ ఒరిజినల్ స్కోర్ – ది బ్రూటలిస్ట్ (డానియల్ బ్లమ్‌బెర్గ్)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ – వికెడ్
ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ – ఐయామ్ నాట్ ఏ రోబో
ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్– ది ఓన్లీ గర్ల్ ఇన్ ది ఆర్కెస్ట్రా
ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ – నో అదర్ ల్యాండ్